

10న బుట్టాయగూడెంలో మినీ జాబ్ ఫెయిర్

ప్రజాశక్తి - ఏలూరు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్, జిల్లా ఉపాధి కార్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల (స్కిల్ హబ్), బుట్టాయగూడెంలో ఈ నెల 10న మంగళవారం మినీ జాబ్ ఫెయిర్ నిర్వహిస్తున్నట్లు ఏలూరు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి గంటా సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మినీ జాబ్ ఫెయిర్‌లో అపోలో ఫార్మసీ, టీమ్ లీస్, జె-గ్రూప్ కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారని, సుమారు 400 మంది నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగావకాశాలు కల్పిస్తారని పేర్కొన్నారు. ఈ మినీ జాబ్‌మేళాకు పదో తరగతి, ఇంటర్, ఐటిఐ, డిగ్రీ, పీజీ వంటి విద్యార్హతలు ఉండి 18-35 సంవత్సరాల వయస్సు గల వారు అర్హులని తెలిపారు. ఇతర వివరాలకు 9652503799, 9666322032ను సంప్రదించాలని సూచించారు. ఈ మినీ జాబ్ మేళాకు హాజరయ్యే అభ్యర్థులు తమ బయడేటా, సర్టిఫికెట్లు నకళ్లతో హాజరు కావాలని కోరారు.

జలం.. గరళం..!

- పంట కాలువలోకి ఆక్వా చెరువుల నీరు
- తాగునీరు కలుషితం
- పట్టించుకోని ప్రజా ప్రతినిధులు, అధికారులు
- వ్యాధుల బారిన ప్రజలు



కె.లంక ఛానల్‌లోకి ఆక్వా నీరు వస్తున్న ప్రాంతాన్ని చూపుతున్న కాళ్ల గ్రామస్తులు

ప్రజాశక్తి - కాళ్ల

జిల్లాలో ప్రస్తుతం ప్రజలను పట్టిపీడిస్తున్న ప్రధాన సమస్య తాగునీరు. ఆక్వా జోన్ పేరిట వెలిసిన ఆక్వా చెరువుల వల్ల ప్రజారోగ్యం కుంటుపడుతోంది. జిల్లాలో పలు గ్రామాల్లో చేపల చెరువుల కోసం అనుమతులు తీసుకుని పలువురు అక్రమంగా రొయ్యల సాగు చేస్తున్నారు. వీటికోసం ఎటువంటి అనుమతులు లేకుండానే ఉప్పునీటి బోర్లు సైతం తవ్వేస్తున్నారు. రొయ్యల సాగులో విచ్చలవిడిగా సీడ్, మందులు వాడడం వల్ల ఆ నీరు కలుషితమవుతోంది. రొయ్యల పట్టుబడి అనంతరం ఆ నీటిని సమీపంలోని పంట కాలువలోకి వదిలేస్తున్నారు. అదే నీటిని పంచాయతీలు తాగునీటి చెరువుల్లో నింపడంతో ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు, ప్రజా ప్రతినిధులు నోరు మెదపడం లేదు. దీనికి ప్రధాన కారణం ప్రజా ప్రతినిధుల్లో 90 శాతం మంది రొయ్యలు సాగు చేస్తుండడమే.

పంట కాలువలు కలుషితం..

ఆక్వా వ్యర్థాలు పంట కాలువల్లో వదిలేయడంతో కాలుష్య కాసారాలుగా మారుతున్నాయి. ఆకుపచ్చని రంగుతో చూసేందుకు భయానకంగా మారాయి. గత్యంతరం లేని పరిస్థితిలో ప్రజలు ఆ నీటినే తాగాల్సి వస్తోంది. పంట కాలువలను పరిరక్షించాల్సిన ఇరిగేషన్ శాఖ అలసత్వంతో తాగునీరు కలుషితం అవుతోందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రొయ్యల చెరువుల్లోని కలుషిత నీటిని పంట కాలువల్లో వదిలేయడంతో ఈ సమస్య తలెత్తుతోంది. ఫలితంగా వేలాది మందికి తాగు, సాగునీరు అందించాల్సిన పంట కాలువలు ప్రమాదకర రసాయనాలకు నిలయంగా మారిపోతున్నాయి.



పసర్లుగా మారిన పంట కాలువ

కాలుష్య కోరల్లో..

కె.లంక పంట కాలువ కాలుష్య కోరల్లో చిక్కుకుంది. కాళ్ల గ్రామానికి తాగునీరందించేందుకు ఈ పంట కాలువే ఆధారం. అయితే దీన్ని ఆనుకొని ఎగువ భాగంలో చేపలు, రొయ్యల చెరువులు ఉండడంతో ఆయా చెరువుల నీరు పంట కాలువలోకి వదిలేయడంతో కాలువ కలుషితం అవుతోంది. ఈ నీటినే గ్రామంలోని తాగునీటి చెరువులో నింపుతున్నారు. కలుషిత నీరు తాగి వ్యాధుల బారిన పడుతున్నామని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. అయినా ఇరిగేషన్ అధికారులు పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో పదివేల మంది జనాభా నివసిస్తున్నారు. కుళాయిల ద్వారా వస్తున్న కలుషిత నీటిని తాగలేక ఇబ్బందులు పడుతున్నారు. తక్షణం అధికారులు చర్యలు తీసుకుని తమకు సురక్షిత నీరు అందించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

తాగునీటి చెరువు నింపాల్సి ఉంది..

బి.సతీష్‌కుమార్, గ్రామ కార్యదర్శి, కాళ్ల

పంట కాలువ పసర్లుగా మారింది. ఈ కాలువ ద్వారా స్వచ్ఛమైన నీరు రావడం లేదు. కాలువలో పసర్ల నీరు ఉన్న దృష్ట్యా ఆ నీటిని తాగునీటి చెరువులో నింపలేదు. సురక్షిత నీటిని అందించాలని ఇరిగేషన్ ఎఇ ఫణిశంకర్ దృష్టికి తీసుకెళ్లాం.

స్వచ్ఛమైన నీటిని సరఫరా చేస్తాం

ఫణి శంకర్, ఇరిగేషన్ ఎఇ, ఉండి

కోలనపల్లి గ్రామం వద్ద ఆక్వా చెరువుల నుంచి కలుషిత నీరు వంటకాలువలోకి చేరుతోంది. ఆ నీరు దిగువకు రాకుండా అడ్డుకట్ట వేశాం. రెండు రోజులపాటు వంతులు వారీ విధానంలో తాగునీటి చెరువులను నింపుకునేందుకు స్వచ్ఛమైన నీరు అందిస్తాం.



మాట్లాడుతున్న వామపక్ష నేతలు

పెంచిన విద్యుత్ ఛార్జీలు రద్దు చేయాలి

9, 10 తేదీల్లో సంతకాలు సేకరణ

12, 13 తేదీల్లో ప్రజాబ్యాలెట్

వామపక్షాల సమావేశం నిర్ణయం

ప్రజాశక్తి - ఏలూరు

వివిధ రకాల పేర్లతో రాష్ట్ర ప్రభుత్వం పెంచిన విద్యుత్ ఛార్జీలు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 9, 10 తేదీల్లో సంతకాలు సేకరణ, 12, 13 తేదీల్లో ప్రజాబ్యాలెట్ కార్యక్రమాలు నిర్వహించాలని సిపిఎం, సిపిఐ, సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ సమావేశం నిర్ణయించింది. స్థానిక సిపిఐ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం న్యూ డెమోక్రసీ జిల్లా నాయకులు బద్దా వెంకట్రావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి, సిపిఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య మాట్లాడుతూ ప్రజలకు విద్యుత్ నిత్యావసర వస్తువుగా మారిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంలోని బిజెపి షరతులకు లొంగిపోయి విద్యుత్ రంగాన్ని ప్రయివేటుపరం చేస్తోందని విమర్శించారు. దానిలో భాగంగా ప్రజలపై ట్రూఅప్ టారిఫ్, సర్దుబాటు, సర్వీసు, అదనపు ఛార్జీలు అంటూ రకరకాల పేరుతో ధరలు పెంచారని విమర్శించారు. అంతేకాకుండా అదానీ కంపెనీకి కాంట్రాక్టు ఇస్తూ విద్యుత్తు స్మార్ట్ మీటర్లను బిగించాలని చూస్తుందని విమర్శించారు. ఇకపై సెల్‌ఫోన్ బ్యాలెన్స్ రీఛార్జ్ చేసుకున్నట్లు కరెంటుకు కూడా ముందుగానే డబ్బులు రీఛార్జి చేసుకోవాల్సి ఉంటుందన్నారు. స్మార్ట్ మీటర్ల కొనుగోలుకు అయ్యే ఖర్చు మొత్తం ప్రజల నుండి వసూలు చేయాలని చూస్తుందని విమర్శించారు. కేంద్రంలోని మోడీ, షాల ప్రభుత్వం తీసుకొచ్చిన 2020 విద్యుత్ సంస్కరణల చట్టంలో భాగంగా మన రాష్ట్రంలో జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఆగమేఘాల మీద ఆ చట్టాన్ని అమలుకు పూనుకుందని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న విద్యుత్ సంస్కరణల వల్ల రైతులకు తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. ఎస్‌సి, ఎస్‌టిలకు ఇస్తున్న ఉచిత విద్యుత్ ఎత్తివేస్తారని ఆవేదన వ్యక్తం చేశారు. కుటీర, చిన్న తరహా పరిశ్రమలకు ఇస్తున్న విద్యుత్ సబ్సిడీలు, రాయితీలను తొలగిస్తున్నారని విమర్శించారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్, నిత్యావసర వస్తువుల ధరలు దారుణంగా పెంచి ప్రజలపై భారాలను మోపుతున్నారని ఆరోపించారు. ప్రజాసమస్యలపై ఉద్యమ నిర్వహించడం రాజ్యాంగం కల్పించిన హక్కు అని, రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం ఉద్యమాలు చేస్తున్న వారిపై నిర్బంధాన్ని ప్రయోగిస్తుందని దుయ్యబట్టారు. అక్రమ అరెస్టులు, ప్రభుత్వ నిర్బంధాన్ని ఆపాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ విధానాలను మార్చుకోకపోతే భవిష్యత్తులో ప్రజా ఉద్యమాలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. సమావేశం పలు తీర్మానాలు ఆమోదించింది. జిపిఎస్‌ను రద్దు చేసి ఒపిఎస్‌ను కొనసాగించాలని, జర్నలిస్టులపై, పౌరహక్కుల సంఘాల నేతలపై ఎన్ఐఎ దాడులు ఆపాలని సమావేశం డిమాండ్ చేసింది. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా నాయకులు బండి వెంకటేశ్వరరావు, పుప్పాల కన్నబాబు, సిపిఎం జిల్లా నాయకులు కె.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ స్వీపర్ల ఆందోళనకు ఎన్‌జిఒల మద్దతు

ఏలూరు అర్బన్: మున్సిపల్ స్కూల్ స్వీపర్లు బకాయి వేతనాల కోసం చేపట్టిన ఆందోళనకు ఎపి ఎన్‌జిఒ అసోసియేషన్ పూర్తి మద్దతు తెలియజేస్తుందని ఎపి ఎన్‌జిఒ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు చోడగిరి శ్రీనివాసరావు, నెర్సు రామారావు తెలిపారు. స్థానిక డిఇఒ కార్యాలయం వద్ద శుక్రవారం నాలుగో రోజు రిలే నిరాహార దీక్షల శిబిరాన్ని వారు ప్రారంభించి మాట్లాడారు. దీక్షలో కూర్చున్న వారికి మెడలో రిబ్బన్లు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిరుద్యోగులకు జీతభత్యాలు చెల్లించడంపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించాలని, జీతాల చెల్లింపునకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ పాఠశాలలను విద్యాశాఖకు బదిలీ చేసి 15 మాసాలవుతున్నా జీతాల సమస్యపై చర్యలు చేపట్టకపోవడం బాధాకరమని అన్నారు. ఆందోళనకు ఎపి ఎన్‌జిఒ అసోసియేషన్, జెఎసి కమిటీ ఆధ్వర్యంలో తమ వంతు సహాయ, సహకారాలు అందిస్తామని, రాష్ట్ర సెక్రటేరియట్లో అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారం కోసం తమవంతు కృషి చేస్తామని తెలిపారు. ఇంకా వీరితోపాటు తాలూకా అసోసియేషన్ నాయకులు మోహన్‌రావు కూడా పాల్గొని సంఘీభావం తెలిపారు. రిలే దీక్షల కార్యక్రమానికి యూనియన్ అధ్యక్షురాలు జె.స్వాతి అధ్యక్షత వహించారు. కార్యక్రమానికి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు లావేటి కృష్ణారావు, బంగారు వెంకటేశ్వరరావు, తానంకి జార్జి తదితరులు పాల్గొని తమ సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమానికి లక్ష్మి, సుజాత, పద్మజ, చిన్ని, ఆంథోని, భాస్కరరావు, చిట్టెమ్మ, హాఫీజ్ ఉన్నిసా, యాస్మిన్ నాయకత్వం వహించారు.



దీక్షలు ప్రారంభించి మాట్లాడుతున్న ఎన్‌జిఒ నేతలు

డిఐజిచే వేలేరుపాడు పోలీస్‌స్టేషన్ తనిఖీ

ప్రజాశక్తి - వేలేరుపాడు

వేలేరుపాడు పోలీస్ స్టేషన్‌ను డిఐజి జివిజి. అశోక్‌కుమార్ వార్షిక తనిఖీల్లో భాగంగా శుక్రవారం సందర్శించారు. తొలిసారి వేలేరుపాడు స్టేషన్‌ను సందర్శించిన డిఐజి అశోక్‌కు మార్‌కు వేలేరుపాడు ఎస్ఐ లక్ష్మీనారాయణ పుష్పగుచ్ఛాన్ని అంద జేశారు. ఈ సందర్భంగా డిఐజి అశోక్‌కుమార్ మాట్లాడుతూ పోలీస్ స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదుదారుల పట్ల మర్యాదతో వ్యవహరించి, వారి సమస్యలను వెంటనే పరిష్కరించేలా చర్యలు చేపట్టాలన్నారు. ప్రతిఒక్కరితో స్నేహపూర్వకంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిఐజి అశోక్‌కుమార్ ఐపిఎస్‌తోపాటు ఏలూరు జిల్లా ఎస్‌పి మేరీప్రశాంతి, కుక్కునూరు సిఐ శ్రీనివాసరావు, హెడ్ కానిస్టేబుల్ దానియేలు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.



డిఐజికి స్వాగతం పలుకుతున్న సిబ్బంది

కోపల్లె ఐస్ ఫ్యాక్టరీలో అమ్మోనియా గ్యాస్ లీక్

కంప్రెషర్ మిషన్ ఊడదీయడంతో వ్యాపించిన గ్యాస్

నలుగురు మహిళా కార్మికులకు అస్వస్థత

ప్రజాశక్తి - కాళ్ల, భీమవరం రూరల్

కాళ్ల మండలం కోపల్లెలోని ఆర్‌విఆర్ రొయ్యల ఫ్యాక్టరీ పక్కన ఐస్ ఫ్యాక్టరీలో అమ్మోనియా గ్యాస్ లీక్ ఘటన కలకలం రేపింది. ఆర్‌విఆర్ రొయ్యల ఫ్యాక్టరీ పక్కనే ఉన్న ప్రభు ఐస్ ఫ్యాక్టరీ ఐదేళ్లక్రితం మూతపడింది. శుక్రవారం ఆ ఐస్ ఫ్యాక్టరీలో సామగ్రిని తొలగించే పనులు చేపట్టారు. ఈ క్రమంలో కంప్రెషర్ మిషన్ ఊడదీయడంతో గ్యాస్ లీకైంది. సరైన జాగ్రత్తలు తీసుకోకుండా మిషన్ ఊడదీయడంతో ఆ కంప్రెషర్‌లో ఉన్న అమ్మోనియా గ్యాస్ ఒక్కసారిగా వ్యాపించింది. ఈ క్రమంలో ఐస్ ఫ్యాక్టరీకి సమీపంలో ఉన్న ఆర్‌విఆర్ రొయ్యల ఫ్యాక్టరీలో పని చేస్తున్న నలుగురు మహిళా కార్మికులు గ్యాస్ పీల్చి అస్వస్థతకు గురయ్యారు. కళ్లు తిరగడం, కళ్ల మంటలు రావడంతో వారిని ఫ్యాక్టరీ సిబ్బంది భీమవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వారి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని, ప్రస్తుతానికి ప్రమాదం లేదని భీమవరం ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వీరాస్వామి తెలిపారు. సంఘటనా స్థలాన్ని ఫైర్ సిబ్బంది, కాళ్ల ఎస్ఐ వీరభద్రరావు పరిశీలించి వివరాలు సేకరించారు. ఈ ఘటనపై పూర్తిస్థాయిలో దర్యాప్తు చేపడుతున్నామని ఎస్ఐ చెప్పారు.

భీమవరం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు



4.78 లక్షల ఎకరాల్లో ఇ-క్రాప్ నమోదు

4 లక్షల ఎకరాల్లో ఇకెవైసి పూర్తి

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలో ఇప్పటి వరకు 4,78,291 (99.71 శాతం) ఎకరాల్లో ఇ-క్రాప్ నమోదైందని జిల్లా వ్యవసాయ శాఖాధికారి వై.రామకృష్ణ తెలిపారు. శుక్రవారం లింగపాలెం మండలం భోగోలు, రంగాపురం, మండల కేంద్రమైన టి.నర్సాపురం, చింతలపూడి మండలం ఎర్రంపల్లి, ఎండపల్లి, చింతలపూడి గ్రామాల్లో ఆయన పర్యటించి ఇ-క్రాప్ నమోదు, ఎరువుల సరఫరా తదితర అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ జిల్లాలో 4,79,661 ఎకరాల సాగు విస్తీర్ణం ఉండగా 4,78,291 ఎకరాల్లో ఇ-క్రాప్ నమోదైందన్నారు. అదే విధంగా 4,00,621 (85 శాతం) ఎకరాల్లో ఇకెవైసి నమోదైందన్నారు. ఈ నెల ఏడో తేదీ సాయంత్రం కల్లా నూరుశాతం పూర్తిచేయాలనే లక్ష్యంతో ఉన్నామన్నారు. ఇ-క్రాప్ నమోదు 17 మండలాల్లో నూరుశాతం పూర్తయ్యిందన్నారు. శుక్రవారం లింగపాలెం మండలం భోగోలు, రంగాపురం గ్రామాల్లో ఇ-క్రాప్ నమోదును పరిశీలించారు. టి.నర్సాపురంలో ఇ-క్రాప్ నమోదును పరిశీలించిన జిల్లా వ్యవసాయ శాఖాధికారి రామకృష్ణ రైతుభరోసా కేంద్రాన్ని సందర్శించి ఇ-క్రాప్ నమోదుకు సంబంధించిన ఆన్‌లైన్ డేటాను తనిఖీ చేశారు. అనంతరం చింతలపూడి మండలంలో ఎర్రంపల్లి, యండపల్లి, చింతలపూడి గ్రామాల్లో ఇ-క్రాప్ నమోదు పరిశీలన చేసిన అనంతరం ఎర్రంపల్లి రైతుభరోసా కేంద్రాన్ని సందర్శించి ఎరువుల సరఫరాకు సంబంధించిన అంశాలపై విచారణ నిర్వహించారు.



ఇ-క్రాప్ నమోదును పరిశీలిస్తున్న జెడి రామకృష్ణ

అంతర్జాతీయస్థాయిలో ఎఎస్‌ఆర్ స్టేడియం అభివృద్ధి

ఎంపీ కోటగిరి శ్రీధర్

ప్రజాశక్తి - ఏలూరు

ఏలూరులోని అల్లూరి సీతారామరాజు స్టేడియంను అంతర్జాతీయ స్థాయిలో తీర్చిదిద్దనున్నట్లు ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్ చెప్పారు. అల్లూరి సీతారామరాజు స్టేడియం అభివృద్ధిపై శుక్రవారం కలెక్టరేట్‌లోని జిల్లా కలెక్టర్ ఛాంబర్‌లో కలెక్టర్ ప్రసన్న వెంకటేష్‌తో విస్తృతంగా చర్చించిన అనంతరం ఎంపీ శ్రీధర్ మాట్లాడారు. క్రీడారంగం అభివృద్ధికి ఏలూరులో అల్లూరి సీతారామరాజు స్టేడియంను నిర్మించి దాదాపు 30 సంవత్సరాలు అవుతుందన్నారు. రాష్ట్రంలో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా వారు నిర్మించిన ఏకైక అథ్లెటిక్ కేంద్రం అల్లూరి సీతారామరాజు స్టేడియం అని, ఇక్కడ శిక్షణ తీసుకున్న క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మెడల్స్ సాధించారని అన్నారు. స్టేడియంలో ప్రస్తుతం సింథటిక్ ట్రాక్ లేదని, రాష్ట్రంలో నాగార్జున యూనివర్సిటీలోని స్టేడియంలో మాత్రమే సింథటిక్ ట్రాక్ ఉందని అన్నారు. అల్లూరి సీతారామరాజు స్టేడియంను రూ.9.50 కోట్లతో అంతర్జాతీయ స్థాయిలో తీర్చిదిద్ది, 8 లైన్ల ట్రాక్ ఏర్పాటు చేసి అంతర్జాతీయ స్థాయిలో ప్రధానమైన క్రీడా పోటీలు ఏలూరులో నిర్వహిస్తామన్నారు. ఖేల్ ఇండియా కార్యక్రమంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం 50 శాతం వరకు నిధులు సమకూరుస్తుందని, మిగిలిన 50 శాతం నిధులను స్థానికంగా సేకరించాల్సి ఉందని అన్నారు. పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధి నిధులు అందిస్తామని, వీటితో ఏలూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ నిధులు కూడా అందించేందుకు చర్యలు తీసుకుంటారని అన్నారు. అల్లూరి సీతారామరాజు స్టేడియం అభివృద్ధికి జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ తమ పూర్తి సహకారం అందిస్తానని చెప్పారని ఎంపీ తెలిపారు. కలెక్టర్, ఏలూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ, క్రీడాభివృద్ధి సంస్థల సహకారంతో ఏలూరులో అంతర్జాతీయస్థాయి స్టేడియం రూపొందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎంపీ కోటగిరి శ్రీధర్ చెప్పారు. ఆయన వెంట ఏలూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ కార్యదర్శి చంద్రశేఖర్, జిల్లా క్రీడాభివృద్ధి సంస్థ చీఫ్ కోచ్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్‌తో మాట్లాడుతున్న ఎంపీ శ్రీధర్

ఆరోగ్య సురక్షలో 8,536 ఓపి నమోదు

ప్రజాశక్తి - ఏలూరు


జిల్లాలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం కింద శుక్రవారం 25 గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమంలో సాయంత్రం ఐదు గంటల వరకు 8,536 ఓపి నమోదైందని డిఎంహెచ్ఒ డాక్టర్ ఎస్.శర్మిష్ఠ తెలిపారు. వీరిలో మహిళలు 4,723 మంది, 3,813 మంది పురుషులు ఉన్నారు. ఆరోగ్య పరీక్షల అనంతరం 82 మందికి మెరుగైన వైద్యం కోసం ఆయా ఆసుపత్రులకు రిఫర్ చేశారు. వివిధ అనారోగ్య సమస్యలున్న 8,536 మందికి ఉచితంగా మందులు అందించామన్నారు.

చేతలు వైసిపి ప్రభుత్వ విధానం

ఎంఎల్ఎ ఉన్నమట్ల ఎలిజా

ప్రజాశక్తి - చింతలపూడి

మాటల్లో కాదు చేతల్లో పనులు చేసి చూపించేది వైసిపి ప్రభుత్వమని చింతలపూడి ఎంఎల్ఎ ఉన్నమట్ల ఎలిజా అన్నారు. పట్టణంలో డాక్టర్ బిఆర్.అంబేద్కర్ బాలుర గురుకుల పాఠశాలను ఆయన శుక్రవారం సందర్శించారు. ప్రస్తుతం జరుగుతున్న పనులపై ఆరా తీశారు. పనులు వేగవంతం చేస్తే వెంటనే ప్రారభించుకుంటామని కాంట్రాక్టర్‌కు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ గతంలో శిలాఫలకాలకు పరిమితమైన వంద పడకలు ఆసుపత్రి, గురుకుల పాఠశాలను పూర్తి చేస్తున్నామని అన్నారు. ప్రారంభానికి ముఖ్యమంత్రిని ఆహ్వానిస్తానని చెప్పారు. చింతలపూడికి 50 పడకలు సరిపోతాయని, వంద పడకలు హస్పటల్ రద్దు చేస్తే లేదని పట్టుబట్టి ముఖ్యమంత్రిని కలిసి వంద పడకలు హస్పటల్ సాధించుకున్నామని గుర్తు చేశారు. దీనికి రూ.25 కోట్లు మంజురు చేయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి పట్టణాధ్యక్షులు కొప్పుల నాగు, మిర్యాల దిలీప్, సిటీ మెడికల్ దుర్గారావు, యువరాజు, ప్రముఖ నాయకులు పాల్గొన్నారు.



పనుల పరిశీలన అనంతరం మాట్లాడుతున్న ఎంఎల్ఎ ఎలిజా

ప్రజల చెంతకే వైద్య సేవలు

ప్రభుత్వ చీఫ్ విప్ ప్రసాదరాజు

ప్రజాశక్తి - మొగల్తూరు

ప్రభుత్వ వైద్య సేవలను ప్రతి ఒక్కరికీ చేరువ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందని ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి రాజు అన్నారు. శుక్రవారం కొత్తపాలెంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రజలకు మెరుగైన వైద్యశాల అందిస్తున్నామన్నారు. అనంతరం స్వయ సహాయక సంఘం సభ్యులతో సమావేశమయ్యారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదని ఆరా తీశారు. ఆయా కార్యక్రమాల్లో సర్పంచి లోకం నాగలక్ష్మి నాని, జెడ్‌పిటిసి తిరుమల బాపూజీ, వైస్ ఎంపిపి కాయల సుబ్బారావు, ఎంపిడిఒ యు.బాజీరాజు, నాయకులు పాల్గొన్నారు

సాగర్‌బాబుకు సత్కారం

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

ఇటీవల సివిల్స్‌లో విజయం సాధించి ఐఆర్‌ఎస్‌కు ఎంపికైన యశ్వ సాగర్‌బాబును స్థానిక కాంగ్రెస్ కిసాన్ సెల్ రాష్ట్ర అధ్యక్షులు జెట్టి గురునాథరావు ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. శుక్రవారం స్థానిక జెట్టి గురునాథరావు కార్యాలయం వద్ద మండలంలోని జొన్నవారిగూడెం గ్రామానికి చెందిన యశ్వ సాగర్ బాబును పూలమాలలతో సత్కరించారు. మెట్ట ప్రాంతమైన జంగారెడ్డిగూడెం పరిసరాల నుంచి ఉన్నత చదువులతో రాణిస్తూ, సివిల్స్ సాధించడం హర్షణీయమని జెట్టి గురునాథరావు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు మాజీ జెడ్‌పిటిసి సభ్యులు ముప్పిడి శ్రీనివాసరావు, కాంగ్రెస్ నాయకులు పోతన జ్ఞాని, ఆకుల చెల్లారావు, యశ్వ వంశీ, పాదపాటి రమేష్ పాల్గొన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణకు కృషి

ప్రజాశక్తి - భీమడోలు



సర్కిల్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని భీమడోలు నూతన సిఐ బి.భీమేశ్వర రవికుమార్ తెలిపారు. చల్లపల్లి సిఐగా పనిచేస్తూ బదిలీల్లో భాగంగా భీమడోలు వచ్చిన భీమేశ్వర రవికుమార్ శుక్రవారం బాధ్యతలను స్వీకరించారు. గతంలో ఈయన ఏలూరు వన్ టౌన్ ఎస్ఐగా పని చేశారు. ఆ తరువాత సిఐగా మచిలీపట్నం, అవనిగడ్డ, టిటిడి విజిలెన్స్ విభాగం, ఆపై చల్లపల్లిలో పనిచేశారు. బాధ్యతలను స్వీకరించిన నూతన సిఐకు భీమడోలు, ద్వారకా తిరుమల ఎస్ఐలు చావా సురేష్, సుధీర్, ఇతర సిబ్బంది సాదరంగా స్వాగతం పలికారు.

విద్యార్థులు పరిశుభ్రత పాటించాలి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

విద్యార్థులు పరిశుభ్రతను అలవర్చుకోవాలని మున్సిపల్ కమిషనర్ పి.భవాని ప్రసాద్ సూచించారు. శుక్రవారం స్థానిక బాలికల ప్రాథమిక ఉన్నత పాఠశాలలో స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు శుభ్రత-పరిశుభ్రత అంశంపై వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఆరోగ్యంగా ఉండటానికి చేతులను ఎప్పటికప్పుడు పరిశుభ్రం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది, విద్యార్థినిలు పాల్గొన్నారు.



పిఎం నుంచి అందుకున్న ప్రశంసా పత్రాలతో విద్యార్థులు

విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేత

ప్రజాశక్తి - పోలవరం

ఆజాదీకా అమృత మహోత్సవంలో భాగంగా చేపట్టిన కార్యక్రమంలో మండలంలోని గూటాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు పరీక్ష పే చర్చాలో పాల్గొని, వారి అభిప్రాయాలను ప్రధానమంత్రి కార్యాలయానికి పోస్ట్‌కార్డు ద్వారా తెలియజేసిన సందర్భంగా ప్రసంశా పత్రాలు అందుకున్నారు. విద్యార్థుల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకున్న ప్రధానమంత్రి కార్యాలయం 5 ప్రతిజ్ఞలతో కూడిన ప్రశంసా పత్రంతో పాటు, మోడీ సంతకంతో కూడిన ఉత్తరమును పంపించారు. ఈ విధంగా పాఠశాలకు చెందిన సుమారు 120 మంది విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రశంసా పత్రము, ప్రధానమంత్రి సంతకంతో కూడిన ఉత్తరములను అందుకున్నారు. ఈ ప్రశంసా పత్రాలు అందుకున్న విద్యార్థులను ప్రధానోపాధ్యాయులు కెవి.రాఘవన్, ఇతర ఉపాధ్యాయులు, గ్రామస్తులు, కమిటీ ఛైర్మన్, మెంబర్లు అభినందించారు.

విజ్ఞాన గ్రంథాలతో మేథస్సు పెంచుకోవాలి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

నేటి విద్యార్థులు సెల్ ఫోన్, ఇంటర్ నెట్‌లతో కాలం గడపకుండా గ్రంథాలయాల్లో మేథస్సునిచ్చే పుస్తకాలను చదివే అలవాటు చేసుకోవాలని స్థానిక సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పి.రాజేష్ సూచించారు. శుక్రవారం స్థానిక అశ్వారావుపేట రోడ్‌లోని సిఎస్ఐ చర్చి వద్ద విశాలాంధ్ర విజ్ఞాన సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సంచార గ్రంథాలయాన్ని సిఐ రాజేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సంచార గ్రంథాలయ వాహనంలో ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనను ఆయన సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు, యువత పుస్తక పఠనం అలవాటు చేసుకోవడం వల్ల ప్రపంచ చరిత్రను తెలుసుకోవడంతో పాటు, మానవ మేథస్సును కూడా పెంచుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు ఎఎస్ఐ ఎం.గంగాధర్, సిపిఐ మండల కార్యదర్శి జెవి.రమణ రాజు, మండల కౌన్సిల్ సభ్యుడు పి.బాలకృష్ణ, ఎం.మోహన్, విశాలాంధ్ర విలేకరి కె.వెంకట్ సంచార వాహన నిర్వాహకులు అజయ్ కుమార్, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి రివర్ ఛారిటబుల్ ట్రస్టు చేయూత

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

ఇంటర్ ఫస్ట్ క్లాస్‌లో పాసై, బిఎస్‌సి నర్సింగ్‌లో సీటు వచ్చి ఫీజు కట్టుకోవడానికి ఇబ్బంది పడుతున్న విద్యార్థికి రివర్ చారిటబుల్ ట్రస్టు వారు రూ.75 వేల చెక్కును అందజేశారు. వివరాల్లోకెళితే రివర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మండలంలోని గొల్లగూడెం కాలనీలో నివాసం ఉంటున్న గోసాల ప్రదీప్ కుమార్ బిఎస్‌సి నర్సింగ్ చదువుతున్నాడు. ఆర్థిక ఇబ్బందులతో ఫీజు కట్టుకోలేని విద్యార్థికి బిఎస్‌సి నర్సింగ్ పూర్తయ్యేంత వరకు పూర్తి ఖర్చును భరిస్తానని రివర్ చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ కాటూరి సుధాకర్ తెలియజేసి చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో రివర్ చారిటబుల్ ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

మండలంలోని తాడువాయిలో గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందాడు. జీలుగుమిల్లి మండలం ములగలంపల్లి గ్రామానికి చెందిన సయ్యద్ లాల్ సాహెబ్(66) శుక్రవారం ద్విచక్ర వాహనంపై ఇంటిని నుంచి బయలుదేరాడు. తాడువాయి జాతీయ రహదారిపై ఎక్కుతున్న సమయంలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో లాల్ సాహెబ్ అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జంగారెడ్డిగూడెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పేకాట శిబిరంపై దాడి

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

మండలంలోని పోతిరెడ్డిపల్లి గ్రామ శివారు దంతుల వారి గూడెంలో శుక్రవారం పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో ఆరుగురు వ్యక్తులను అదుపులోనికి తీసుకొని అరెస్టు చేసినట్లు రూరల్ ఎస్ఐ తలారి రామకృష్ణ తెలిపారు. వీరి వద్ద నుంచి రూ.14 వేల నగదు స్వాధీనం చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కోళ్ల వ్యర్థాలను తరలిస్తున్న వాహనం స్వాధీనం

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

మండలంలోని వెంకటాపురం గ్రామ శివారు వద్ద అక్రమంగా కోళ్ల వ్యర్థాలను తరలిస్తున్న బొలెరో వాహనాన్ని శుక్రవారం అదుపులోనికి తీసుకున్నట్లు రూరల్ ఎస్ఐ తలారి రామకృష్ణ తెలిపారు. రూరల్ సిఐ బాల సురేష్ ఆధ్వర్యంలో కోళ్ల వ్యర్థాలకు సంబంధించిన వాహనాన్ని స్వాధీనం చేసుకొని, వ్యర్థాలను భూమిలో పాతి పెట్టామన్నారు. తరలిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో విద్యార్థుల రక్తదానం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో లైన్స్‌క్లబ్ సహకారంతో శుక్రవారం స్థానిక వట్లూరులోని సర్ సిఆర్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో 65 మంది విద్యార్థులు రక్తదానం చేశారని జిల్లా రెడ్‌క్రాస్ ఛైర్మన్ బివి కృష్ణారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల ఇన్‌ఛార్జి కరస్పాండెంట్ కె.హరిరామ కృష్ణం రాజు మాట్లాడుతూ తలసేమియా చిన్నారుల కోసం ప్రతి సంవత్సరం రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో 5 రక్త దాన శిబిరాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. అత్యవసర సమయాల్లో తమ కళాశాల విద్యార్థులు రక్తదానం చేయడానికి ముందుంటారని తెలిపారు. ఈ సందర్భంగా రక్తదానం చేసిన విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు. అనంతరం ప్రిన్సిపల్ డాక్టర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రక్తదానం చేయడం అంటే ప్రాణదానం చేసినట్లేనని, ప్రతి విద్యార్థి రక్తదాతలను ఆదర్శంగా తీసుకుని స్వచ్ఛందంగా రక్తదానం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఆర్ఎస్ఆర్‌కె వరప్రసాదరావు, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, లైన్స్‌క్లబ్ సభ్యులు కె.వేణు బాబు, కె.పద్మావతి, ఎన్ఎస్ఎస్ పిఒ వి.ప్రణవ్, పిఆర్ఒ కెవి.రమణ, తదితరులు పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న విద్యార్థులు

వృద్ధుల సంక్షేమానికి కృషి : ఎంఎల్ఎ

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

పట్టణంలో అతి త్వరలో సీనియర్ సిటిజన్స్ కోసం స్థలం కేటాయించి, నూతన భవన నిర్మాణానికి కృషి చేస్తానని స్థానిక ఎంఎల్ఎ ఉన్నమట్ల ఎలిజ తెలిపారు. శుక్రవారం స్థానిక సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రోటరీ కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవ ముగింపు సభకు ఎంఎల్ఎ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృద్ధుల సంరక్షణకు సిఎం జగన్‌మోహన్ రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి పోల్నాటి బాబ్జీ, మున్సిపల్ ఛైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి, జిల్లా విభిన్న ప్రతిభావంతులు, సీనియర్ సిటిజన్స్, ట్రాన్స్‌జెండర్స్ సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ జిసిహెచ్.ప్రభాకర్, సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుకునూరి రామచంద్రరావు, పలువురు సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న సిఇఒ, ఉపాధ్యాయులు

జాతీయస్థాయి షటిల్ పోటీలకు ఎన్ఆర్ఐ కళాశాల విద్యార్థుల ఎంపిక


ఏలూరు : అండర్-19 షటిల్ సింగిల్స్ బాలుర విభాగంలో ఎన్ఆర్ఐ జూనియర్ కళాశాల విద్యార్థులు మంగం హర్ష, ఉప్పు తరుణ్ ఇద్దరు విద్యార్థులు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా నుంచి పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరచి, జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనారని సిఇఒ వి.తులసీరామ్ తెలిపారు. జాతీయ స్థాయి స్కూల్ గేమ్స్, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ వారి ఆధ్వర్యంలో ఏలూరు సిఆర్ఆర్ కళాశాల ఇండోర్ స్టేడియంలో ఈనెల 5న నిర్వహించిన పోటీల్లో వీరు గెలుపొందారు. ఈ సందర్భంగా కళాశాలలో కార్యక్రమం ఏర్పాటు చేసి ఎంపికైన విద్యార్థులను ఘనంగా సత్కరించారు. అనంతరం తులసీరామ్ మాట్లాడుతూ జాతీయస్థాయి పోటీలలో కూడా ఉత్తమ ప్రతిభ కనబరిచి విజయం సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మంగం హర్ష తల్లిదండ్రులు హెడ్ కానిస్టేబుల్ లక్ష్మణరావు, విమలాదేవి, ఉప్పు తరుణ్ తల్లిదండ్రులు నాగభూషణం, సుభాషిణి, కళాశాలల ప్రిన్సిపల్స్ వి.కనకరత్నం, ఇ.మురళీకృష్ణ, కె.ప్రభాకరరావు, ఎస్.సత్యనారాయణ, సిహెచ్.శివకుమార్, కళాశాల ఎఒలు కె.మల్లికార్జునరావు, వి.రాట్నాలు, ఎస్.రామాంజనేయులు, జె.నాగరాజు పాల్గొన్నారు.

శిథిలావస్థకు నారాయణపురం వంతెన

పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి - ఉంగుటూరు

నారాయణపురంలో ఏలూరు కాలువపై నిర్మించిన ఆర్అండ్‌బి శాఖకు చెందిన వంతెన శిథిలావస్థకు చేరింది. గత ఎన్నికల్లో అధికార పార్టీ నేతలు ఈ వంతెన నిర్మాణానికి కృషి చేస్తామని ఇచ్చిన హామీలు నేటి వరకూ నెరవేరలేదు. జాతీయ రహదారిని ఆనుకుని ఏలూరు కాలువపై నారాయణపురం వద్ద ఉన్న ఈ వంతెన కొల్లేరు ముఖద్వారంగా చెబుతారు. గణపవరం, భీమవరం వెళ్లేందుకు ఇదే ప్రధానమైన వంతెన. బ్రిటీష్ కాలం నాటి ఈ వంతెన స్లాబు పెచ్చులూడి ఇనుప ఊచలు బయటకి కనిపిస్తున్నాయి. వంతెన పిల్లర్ వైపు నేల దిగుతోంది. చేపలు, రొయ్యలు, ధాన్యం తదితర వ్యవసాయ పంటలే కాక వాణిజ్యపరంగా భారీ వాహనాలు ఇదే వంతెన మీదుగా ప్రయాణిస్తున్నాయి. అలాంటి ఎంతో ప్రాముఖ్యత కలిగిన ఈ వంతెన నిర్మాణానికి అధికారపార్టీతో సహా ప్రతిపక్ష నాయకులు కూడా గత 15 ఏళ్ల నుంచి హామీలు ఇస్తున్నా కార్యరూపం దాల్చడం లేదు. భీమవరంలో సిఎం బహిరంగ సమావేశంలో కూడా ఈ వంతెన నిర్మాణానికి నిధులు ఇస్తున్నట్లు ప్రకటించడం గమనార్హం. ఆర్అండ్‌బి, రెవెన్యూ అధికారులు సైట్ సర్వే చేసి, కొలతలు తీసుకుని ప్రభుత్వానికి నివేదిక పంపినా కార్యరూపం దాల్చలేదు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు స్పందించి వంతెన నిర్మాణం చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



నారాయణపురంలో శిథిలావస్థకు చేరిన వంతెన

అవినీతిరహిత సమాజ స్థాపనకు కృషి



అవగాహనా కార్యక్రమంలో మాట్లాడుతున్న సుబ్రహ్మణ్యం

ప్రజాశక్తి - మండవల్లి

అవినీతి సమాజానికి పట్టిన పీడ అని అవినీతి రహిత సమాజ స్థాపనకు ప్రతిఒక్కరు కృషి చేయాలని ఇండియన్ బ్యాంక్ విజయవాడ జోనల్ మేనేజర్ వివిఆర్ సుబ్రహ్మణ్యం స్పష్టం చేశారు. అవినీతి నిర్మూలన వారోత్సవాల్లో భాగంగా ఇండియన్ బ్యాంక్ మండవల్లి శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక నాగేంద్ర స్వామి కళ్యాణ మండపంలో అవినీతి నిర్మూలనపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అధికారంలో ఉన్న వ్యక్తులు తమ సొంత లాభం కోసం నిజాయితీ లేని మార్గాల్లో వెళ్లడమే అవినీతి అన్నారు. అవినీతిపై బ్రహ్మాస్త్రం ఎసిబి అని తెలిపారు. అవినీతికి పాల్పడుతున్న అధికారులపై 14400 యాప్‌లో ఫిర్యాదు చేయవచ్చునని, ఫిర్యాదు చేసిన వారి పేర్లను బహిర్గతం చెయ్యరని పేర్కొన్నారు. అంతేకాకుండా బ్యాంకింగ్ రంగం అవినీతి నిర్మూలనే లక్ష్యంగా ముందుకు వెళుతుందని తెలిపారు. కృష్ణాజిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ టి.సురేంద్ర జయవర్ధన్ మాట్లాడుతూ అవినీతికి నో చెప్పండి లంచం ఇవ్వడం, తీసుకోవడం కూడా చట్టరీత్యా నేరంగా పరిగణించబడతాయన్నారు. అనంతరం అవినీతి నిర్మూలిద్దాం, భారతదేశ పౌరునిగా భారతదేశాన్ని అవినీతి రహిత దేశంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్ బి.దుర్గారావు, సర్పంచి మెండ జాన్సీ, శివాలయం ఛైర్మన్ కొల్లా కృష్ణ, ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక సభ్యులు ఎల్ఎస్ భాస్కరరావు, గన్నవరం మాజీ సర్పంచి గుడివాడ వీరరాఘవయ్య, ముద్ర బోయిన సుబ్బారావు, మెండ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

'పేద ప్రజలకు వరం జగనన్న ఆరోగ్య సురక్ష'



పెదగొన్నూరులో కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

ప్రజాశక్తి - ముసునూరు

జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేదలకు వరం లాంటిదని జెడ్‌పిటిసి డాక్టర్ ప్రతాప్, వైస్ ఎంపిపి కోటగిరి రాజనాయన పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని సూరేపల్లి గ్రామ సచివాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఉన్న ప్రజలందరూ తమ అనారోగ్య సమస్యలను వైద్యులకు వివరించి, ఉచితంగా మందులు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రాపర్ల కృష్ణకుమారి సుబ్బారావు, ఎంపిడిఒ జి.రాణి, తహశీల్దార్ దాసరి సుధ, వైద్యులు యం.కిరణ్ కరిముల్లా, సచివాలయ సిబ్బంది, ఆరోగ్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

జీలుగుమిల్లి : పేదలకు నాణ్యమైన వైద్యం అందించడమే జగనన్న సురక్ష లక్ష్యమని మండల ప్రత్యేక అధికారి పివిఎస్.నాయుడు పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని ములగళంపల్లి పంచాయతీ పరిధిలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంప్‌లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజలకు మెరుగైన ఉచిత వైద్యం అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం సురక్ష శిబిరాలను ఏర్పాటు చేసిందని, ప్రతిఒక్కరూ ఈ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి హాజరైన వారికి పలు రకాల పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి మల్లం వసంతరావు, మండల పార్టీ అధ్యక్షులు సందా ప్రసాద్, వైస్ ఎంపిపి సోమగని శ్రీనివాస్, సర్పంచి రాజు, సొసైటీ అధ్యక్షులు ఘంటసాల గాంధీ, బోధ శ్రీనివాస్, తహశీల్దార్ సుందర్‌సింగ్, ఎంపిడిఒ కృష్ణ ప్రసాద్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మండవల్లి : వైద్య సేవలు అందించడంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చింది ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి అని కైకలూరు నియోజకవర్గం ఎంఎల్ఎ దూలం నాగేశ్వరావు స్పష్టం చేశారు. మండలంలోని కానుకొల్లులో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ఆరోగ్య సురక్ష కౌంటర్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తండ్రి బాటలోనే నడుస్తూ ప్రజలకు వైద్యాన్ని మరింత చేరువ చేసి, ఇంటి వద్దకే వైద్యం అందించిన ఘనత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కిందని తెలిపారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాలను సద్వినియోగం చేసుకుని, ఆరోగ్యంగా ఉండాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచి నాగదాసి థామస్, ఎంపిపి పెద్దిరెడ్డి శ్రీరామ దుర్గాప్రసాద్, మండల పార్టీ అధ్యక్షుడు గుమ్మడి వెంకటేశ్వరరావు, అల్లినగరం సర్పంచి జంపాన వీరబాబు, లింగాల ఎంపిటిసి నాయన బాబు, రత్తయ్య నాయుడు, ఎంపిడిఒ వెంకటరమణ, తహశీల్దార్ రాజకుమార్, ఇఒపిఆర్‌డి ఆనంద్ బాబు, వైద్య సిబ్బంది, సచివాలయం సిబ్బంది, ఆశావర్కర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.



గంగినీడుపాలెం వైద్య శిబిరంలో మాట్లాడుతున్న ఎంఎల్ఎ బాలరాజు

టి.నరసాపురం : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్షను ప్రతిఒక్కరూ వినియోగించుకోవాలని పోలవరం ఎంఎల్ఎ తెల్లం బాలరాజు సూచించారు. మండలంలోని బండివారిగూడెం పంచాయతీ పరిధిలో గంగినీడుపాలెం గ్రామంలో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎంఎల్ఎ తెల్లం బాలరాజు ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం జగనన్న ఆరోగ్య సురక్షను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో డెంగ్యూ, మలేరియా, బిపి, షుగర్ వంటి 9 రకాల రక్త పరీక్షలు నిర్వహించి, 150 రకాల మందులు ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఆరోగ్యాంధ్రప్రదేశ్ లక్ష్యంగా రాష్ట్రంలో పరిపాలన సాగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో డిఎల్‌పిఒ ఎండి రజావుల్లా, ఎంపిపి దారబోయిన లక్ష్మీ, సర్పంచి నాళం శిరీషా కాశీ, దాసరి రాంబాబు, తహశీల్దార్ జెవి సుబ్బారావు, ఎంపిడిఒ మంగాకుమారి, మండల వైద్యాధికారులు ఫణీంద్ర బాబు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ముదినేపల్లి : జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడిఒ పి.మల్లీశ్వరి తెలిపారు. మండలంలోని పెదగొన్నూరులో శుక్రవారం ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె రోగులకు అందుతున్న సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. విభాగాల వారీగా అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. రోగులకు సంతృప్తికర స్థాయిలో వైద్య సేవలు అందించాలని వైద్యులకు సూచించారు. రోగులు పరీక్ష కేంద్రంలో కంటి పరీక్షలు చేయించుకున్నారు. వైద్య శిబిరానికి రాలేని వారిని అంబులెన్స్ వాహనాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచి తాడంకి శిరీష, గంటా సంధ్య, టి.రాజేష్, వైస్ ఎంపిపి సిహెచ్.సునీత, వైసిపి నాయకులు సోమ సత్యనారాయణ, రాచూరి కుమార్, తదితరులు పాల్గొన్నారు.

లోపూడిలో కొనసాగిన టిడిపి నిరసన దీక్ష

ప్రజాశక్తి - ముసునూరు

అక్రమ కేసులతో అధికారం శాశ్వతం చేసుకోవాలనుకోవడం జగన్మోహన్‌రెడ్డి భ్రమ అని నూజివీడు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి, మాజీ ఎంఎల్ఎ ముద్దరబోయిన వెంకటేశ్వరరావు తెలిపారు. మండలంలోని లోపూడిలో చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టుకు నిరసనగా చేపట్టిన రిలే నిరాహారదీక్ష కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. అనంతరం నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు ఎటువంటి మచ్చలేకుండా బయటికి రావడం తధ్యమని, టిడిపి శ్రేణులు మనోధైర్యంతో పోరాటం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రఘు బాబు, లక్క పాము కాంతారావు, వేంపాటి శ్రీనివాసరావు, చలమాల వెంకటేశ్వరరావు, కాటేపల్లి సత్యనారాయణ, పర్వతనేని వెంకటేశ్వరరావు, పేరం వెంకట రత్నం, అధిక సంఖ్యలో మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు.



దీక్షల్లో పాల్గొన్న మాజీ ఎంఎల్ఎ ముద్దరబోయిన వెంకటేశ్వరరావు



రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న ఎంపిపి

రూ.5.5 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం

ప్రజాశక్తి - చింతలపూడి

మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు మండల ఎంపిపి రాంబాబు తెలిపారు. రేచర్ల పంచాయతీలో ఎంజిఎన్ ఆర్ జిఎస్ గ్రాంట్ రూ.5.5 లక్షలతో రేచర్ల తండాలో సీసీ రోడ్డు నిర్మాణంను జెడ్‌పిటిసి నీరజ, సర్పంచి శివరామకృష్ణతో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైసిపి వార్డ్ మెంబెర్ అనిత, తుమ్మూరి వెంకట్రామి రెడ్డి, వెంకటేశ్వరావు, తవిర్య, పార్టీ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎస్‌సి, ఎస్‌టి చట్టాలపై అవగాహన ఉండాలి

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

గ్రామాల్లో ఎస్‌సి, ఎస్‌టి చట్టాలపై అవగాహన ఉండేలా చూడాలని జిల్లా ఎస్‌పి మేరీ ప్రశాంతి తెలిపారు. జిల్లా ఎస్‌పి మేరీ ప్రశాంతిని జిల్లా ఎస్‌సి, ఎస్‌టి విజిలెన్స్ అండ్ మోనటరింగ్ కమిటీ సభ్యులు తోకల రాజేష్‌బాబు జిల్లా ఎస్‌పి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్‌పి మాట్లాడుతూ ఎస్‌సి, ఎస్‌టి చట్టాలపై ఆ సామాజిక వర్గాలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని, వారికి ఎప్పుడూ అందుబాటులో ఉంటూ, వారి సమస్యలు అధికారుల దృష్టికి తీసుకువస్తే తక్షణమే చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రభుత్వం ఇచ్చిన అవకాశంతో పేద ప్రజలకు ఉత్తమ సేవలందించాలని వారు తోకల రాజేష్ బాబును కోరారు. దీనిపై స్పందించిన రాజేష్‌బాబు మాట్లాడుతూ ఎస్‌సి, ఎస్‌టిల అభ్యున్నతికి తాను మరింత కష్టపడి పనిచేస్తానని తెలిపారు. రాజ్యాంగంలో వారి హక్కులను కాపాడతానని, వారికి ఎప్పుడూ అందుబాటులో ఉంటానని తెలియజేశారు.

రైతులంతా సామూహిక ఎలుకల నిర్మూలన చేపట్టాలి

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని రైతులంతా సామూహికంగా ఎలుకల నిర్మూలనా చర్యలు చేపట్టాలని మండవల్లి సహాయ వ్యవసాయ సంచాలకులు జి.వెంకటలక్ష్మి కోరారు. మండలంలోని అన్నవరంలో శుక్రవారం మండలస్థాయి సామూహిక ఎలుకల నిర్మూలనపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని రైతులందరూ సామూహికంగా ఎలుకల నివారణ చేపట్టడానికి ప్రభుత్వం 100 శాతం రాయితీతో బ్రోమోడయోలోన్ మందును సరఫరా చేస్తుందన్నారు. రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, వారి పొలాల్లో ఎలుక బొరియలను గుర్తించి, మందు పెట్టి ఎలుకలను నియంత్రణ చేసుకోవాల్సిందిగా ఆమె సూచించారు. మండల వ్యవసాయ అధికారి బొర్రా వేణుమాధవ్ మాట్లాడుతూ మండలం మొత్తం మీద 97 కేజీల బ్రోమోడైలోన్ మందును సరఫరా చేశామన్నారు. వరి సాగు చేసే విస్తీర్ణాన్ని బట్టి ఆ మొత్తము అన్ని ఆర్‌బికెలకు సరఫరా చేయటం జరిగిందన్నారు. మందు కావాల్సిన ప్రతి రైతు వారి ఆర్‌బికె కేంద్రం నందు సంప్రదించి, ఉచితంగా తీసుకోవాల్సిందిగా రైతులను కోరారు. అనంతరం 96 పాళ్ల నూకలు, 2 పాళ్ల నూనె, 2 పాళ్ల మందును కలిపి ఎరువును తయారు చేసుకునే విధానాన్ని రైతులకు చూపించి, అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అన్నవరం గ్రామ రైతులు పాల్గొన్నారు.